కథ

అదొక మధ్య తరగతి ఇల్లు. ఆ ఇంటి యజమాని రామారావు గారు. రామారావు గారి వయస్సు యిప్పుడు 70 సంవత్సరాలు. ఆయన ఒక పెద్ద ఫ్యాక్టరీలో కార్మికుడుగా పని చేసి రిటైరైనాడు. ఉద్యోగం చేస్తున్న సమయంలో ఆయన ఒక పెద్ద కార్మిక నాయకుడు. అనేక సార్లు యాజమాన్యాన్ని గడగడ లాడించాడు ఆయన. ఆయనకు అనేక మంది రాజకీయ నాయకులతో, పెద్ద పదవులలో వున్న అధికార్లతో పరిచయం వుంది.

శ్రీనివాసరావు అతనికి ఒక్కగా నొక్క కొడుకు. అతన్ని పెద్ద చదువులు చదివించలేదు రామారావు గారు. శ్రీనివాసరావు కూడ తండ్రి లాగానే ఒక ఫ్యాక్టరీలో చిన్న కార్మికునిగా చేరాడు.

ఆ రోజు ఉదయం 7 1/2 గంటలవుతుంది. శ్రీనివాసరావు కాకీ పాంటు, కాకీ షర్టు వేసుకొని బూట్ వేసుకుంటూ, "రాధా" అని భార్యను పిలిచాడు. రాధ వెంటనే రాక పోయే సరికి యీసారి "రాధా" అని మరింత బిగ్గరగా పిలిచాడు శ్రీనివాసరావు.

రాధ పరుగెత్తుకుంటూ వచ్చింది "ఏమిటి" అని.

"7 1/2 అయింది. కాఫీ ఏదీ" అన్నాడు.

"పాలు యిప్పుడే వచ్చాయి - తెస్తా నుండండి కాఫీ" అని లోపలికి వెళ్ళింది రాధ.

"ఏమిటంత హడావిడి! ఈయన గారు సరిగ్గా 8 గంటలయ్యే సరికి ఫ్యాక్టరీలో వుండకపోతే తలకొట్టి మెలేస్తారా" - అన్నారు రామారావు గారు.

శ్రీనివాసరావు ఏమీ మాట్లాడ లేదు. మనసులో అనుకున్నాడు ఫ్యాక్టరీకి ప్రతి కార్మికుడూ సమయానికి వెళ్లాలి అని. అతను కాఫీ తాగి సైకిలు తొక్కుకుంటూ ఫ్యాక్టరీకి వెళ్ళి పోయాడు.

ఆ రాత్రి శ్రీనివాసరావు యింటికి ఆలస్యంగా వచ్చాడు. గుమ్మం దగ్గరే పడక కుర్చీలో కూర్చున్న రామారావు గారు.

"ఏరా - ఫ్యాక్టరీలో ఏవో గొడవలు వచ్చాయటగా" అన్నారు. శ్రీనివాసరావు ఏ మాట్లాడకుండా లోపలికి వెళ్లాడు బట్టలు మార్చుకోవటానికి.

"ఏరా మాట్లాడవేం? - ఏం జరిగిందసలు?"

"ఏమీ లేదు" అన్నాడు శ్రీనివాసరావు. తండ్రి గుణం అతనికి తెలుసు చిలికి చిలికి గాలి వాన చేస్తాడాయన.

"ఏమీ లేక పోవడమేమిటి? - రిట్రెంచ్ చేస్తానన్నారుటగా! అందులో నీ పేరు కూడా వుందటగా"

"అవును" - అన్నాడు శ్రీనివాసరావు.

"అవునా! - ఎంత మామూలుగా చెబుతున్నావురా! - ఎందుకు రిట్రెంచ్ చేస్తారట?"

"కంప్యూటర్ మిషను వచ్చింది. పది మంది కార్మికులు చేసే పనిని ఒక కంప్యూటరు యంత్రం కొన్ని సెకన్లలో చేసేస్తోంది. అప్పుడు కొంత మంది అనవసరమేగా" అన్నాడు శ్రీనివాసరావు.

"కంప్యూటర్ మిషన్లు ఎవర్నడిగి తెప్పించారోయ్ - యింత మంది కడుపులు కొడ్తే వూరుకొంటామా - రేపే రెడ్డిని పట్టుకొని కోర్టులో వేద్దాం. ఆ ఫ్యాక్టరీ మూతపడే వరకూ నిద్ర పోకూడదు...."

"ఊరుకో నాన్న - ఆ ఫ్యాక్టరీ మూతపడితే మనకేం వస్తుంది! ఆ ఫ్యాక్టరీ పనిచేస్తే, కొంత మంది కన్నా జీవనోపాధి వుంటుంది. మూత పడితే ఏం లాభం?"

"మనకి లాభం లేనప్పుడు మూత పడితే మనకేమట నష్టం!"

"అలా అనుకోకూడదు...."

"ఏరా గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందట. నాకే పాఠాలు చెబుతున్నావా! ఉద్యోగం తీసేస్తే చేతులు ముడుచుకొని కూర్చుంటావా?"

"లేదు - అసలు ఉద్యోగాలు తీసేస్తామని ఎవరూ అనలేదు. మన వాళ్లే ఒక లిస్టు తయారుచేసి, వీళ్లని తీసేస్తారుట అని ప్రచారం చేశారు. మేము యజమానిగారితో మాట్లాడాలి అనుకుంటే ఆయన ఊర్లో లేరు. హైదరాబాద్ వెళ్లినట్లుగా తెలిసింది" అన్నాడు శ్రీనివాసరావు.

"ఆఁ కరెక్టు - నా ఊహ కరెక్టు - హైదరాబాద్‌లో అధికారులతో మాట్లాడి మీకు రిట్రెంచ్ ఆర్డర్సు యిస్తారు. అందుకే మీ యజమాని హైదరాబాదులో కూర్చున్నాడు."

"ఆయన అలాంటి వారి కారు. కార్మికులంటే ప్రాణం ఆయనకు."

"పిల్లకాకి కేం తెలుసు వుండేలు దెబ్బ అని - నీకేం తెలుసురా - యజమానులు కార్మికులకు చేసే ద్రోహాలు - కార్మికుల రక్తం పీల్చి త్రాగడానికి వెనకాడారు - వాళ్లని ఎప్పుడూ నమ్మకూడదు!"

"ఏమో! మీ రోజులు వేరు. మా రోజులు వేరు అనిపిస్తుంది నాకు" అన్నాడు శ్రీనివాసరావు.

"అవును - మొదట్లో నీ లాంటి తెలివి తక్కువ వాడికి అలాగే అనిపిస్తుంది. తర్వాత తెలుస్తుంది నిజ స్వరూపం"

"సర్లేండి. మీ రనవసరంగా కలుగజేసుకోండి. సమస్యని మేము పరిష్కరించుకోగలం" అన్నాడు శ్రీనివాసరావు.

"మీ మొహం - మీ వల్ల అవదు - ఆలస్యం అమృతం విషం అన్నారుగా అవతల వాళ్ల కన్నా మనం ఎప్పుడూ అడ్వాన్సుగా వుండాలి. నేను సుబ్బారావుని పిలిపిస్తాను...."

"వద్దు - వద్దు - సుబ్బారావుని పిలిపించకండి - అతను సమస్యని మరింత జటిలం చేస్తాడు - అనవసరపు గొడవలు వస్తాయి."

"నీకు తెలియదురా బాబు - నాన్న గారు చెప్పినట్లు విను. మీ నాన్నంటే

ఎలా?

తల్లి: ఇంత వయస్సు వచ్చింది. పనీ పాటూ నేర్చుకోకపోతే ఎలా? నీ వయస్సుకి నేను ముగ్గురు పిల్లలను కన్నాను తెలుసా?

కూతురు: పెళ్లి చేస్తే నేనూ కనే దానిని. చెయ్యకుండా కనమంటే ఎలా?

వి.వి. సీతారామ్‌దాస్

— ఎమ్మెస్ జి. కృష్ణ

అందరికీ హడలురా - ఆయన యిలాంటి సమస్యలనెన్నో పరిష్కరించారురా" అంతవరకు ఈ సంభాషణంతా వింటున్న శ్రీనివాసరావు తల్లి అన్నది.

శ్రీనివాసరావు ఏమీ మాట్లాడకుండా లోపలికి వెళ్ళి పోయాడు. శ్రీనివాసరావు భార్య రాధ భర్త గుండె మీద తల పెట్టి కళ్ల నీళ్లు పెట్టుకొన్నది, భర్త ఉద్యోగం పోతుందేమో అని భయపడుతూ.

ఆ మర్నాడు టౌన్ హాల్లో కొంత మంది కార్మికులు సమావేశమయ్యారు. శ్రీనివాసరావు తండ్రి రామారావు గారు వచ్చారు. సుబ్బారావుని పిలిపించారు. రామారావు గారు సుబ్బారావు ఆవేశంగా మాట్లాడారు. స్ట్రైక్ చేయిస్తానన్నాడు. ఏమీ భయపడ వద్దు అన్నాడు.

శ్రీనివాసరావు తండ్రి రామారావు గారు మాట్లాడుతూ యీ సమ్మెకు నాయకత్వం వహిస్తానన్నారు. నిరాహార దీక్షలు చేస్తాం అన్నాడు. యాజమాన్యం కాళ్ల బేరానికి వచ్చి తీరుతుంది అన్నారు.

ఆ రాత్రి జరిగిన పార్టీలో ఊళ్లో వున్న యితర నాయకులు తమ తమ మద్దతు ప్రకటించారు.

ఈ వార్త ఆ ఊరి ఎం.ఎల్.ఏ. గారి వరకు వెళ్ళింది. వెంటనే పిలిపించారు ఎం.ఎల్.ఏ. గారు రామారావు గారినీ, సుబ్బారావునీ. అంతా విని తన సంపూర్ణ సహకారాన్ని యిస్తానన్నారు.

ఆ మర్నాడు కూడా ఆ ఫ్యాక్టరీ యజమాని హైదరాబాదు నుండి రాలేదు. ఆ రోజు ఫ్యాక్టరీకి సుబ్బారావు వచ్చాడు. శ్రీనివాసరావునీ మరో ముగ్గురు కార్మికులని పిలిచాడు. వాళ్ల చేతికి ఒక చిన్న చేతి బాంబు నిచ్చాడు. అదమచూచి కంప్యూటర్‌ని పేల్చేయమన్నాడు. యిది తెలిసిన కార్మికులు కోపంతో వూగిపోయారు. సుబ్బారావుని పట్టుకొని తిట్టారు. కార్మికులు అంత ద్రోహులు కారు అన్నారు. మరోసారి యిలాంటి సలహా యిస్తే పోలీసులకి అప్పచెపాం అన్నారు.

ఆ రాత్రి శ్రీనివాసరావు, అతని తండ్రి రామారావు చాలా సేపు మాట్లాడు కోలేదు. చివరికి రామారావు గారే అన్నారు.

"ఆ విషయం నాకేం తెలియదు."

"ఏ విషయం?" అన్నాడు శ్రీనివాసరావు.

నాలిక్కరుచుకున్నాడు రామారావు.

ఆ మర్నాడు ఫ్యాక్టరీ యజమాని వచ్చాడు. ఆయనతో పాటు లేబరు మినిస్టరుగారు, పరిశ్రమల మంత్రి గారు వచ్చారు.

ఆ సాయంత్రం బ్రహ్మాండమైన బహిరంగ సభ ఆ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేయబడింది.

ఊళ్లో ప్రముఖులందరికీ ఆహ్వానాలు పంపారు.

రామారావు గారు, సుబ్బారావు కూడా వచ్చారు.

కార్మికులంతా ముందు వరసలో కూర్చున్నారు. వాళ్ల మధ్య శ్రీనివాసరావు కూర్చున్నాడు.

సభ ప్రారంభమయింది.

పరిశ్రమల మంత్రి గారు యిలా అన్నారు.

"సోదర సోదరీ మణులారా! మనం 21వ శతాబ్దంలో ప్రవేశించి వున్నాం. ఈ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని చూస్తే నా కెంతో సంతోషంగా వుంది. ఈ ఫ్యాక్టరీ యీ మధ్య ఆధునాతనమైన కంప్యూటరును కొనుక్కొన్నది. అందువలన 50 మంది కార్మికులని రిట్రెంచ్ చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. కాని విశాల హృదయం గల ఈ ఫ్యాక్టరీ యాజమాన్యం వారు తమ దగ్గర ఎన్నాళ్ల నుంచో పని చేస్తున్న 50 మంది కార్మికులని తీసివేయడానికి యిష్టపడక, వారి కోసం ఎంతో శ్రమపడి మరొక కొత్త పరిశ్రమని ప్రారంభించడానికి గవర్నమెంటు వారి వద్ద అనుమతి తీసుకొని, ఈ రోజు దానిని ప్రారంభిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవాన్ని నా చేతుల మీదుగా జరపడం నాకు ఒక అదృష్టంగా భావిస్తున్నాను."

సభలో చప్పట్లుమారుమ్రోగాయి. ఫ్యాక్టరీ యజమాని గారి మెడలో దండలు పడ్డాయి. యింతలో లేబరు మినిస్టరు గారు లేచి నుట్లాడారు.

"ఈ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని, యిక్కడ కార్మికులని, వాళ్లకి పరస్పరం ఒకరి యందు ఒకళ్లకుండే ప్రేమ, అనుబంధం చూస్తుంటే ఈ 21వ శతాబ్దంలో ప్రతి పరిశ్రమలో పని చేసే కార్మికుడు వెళ్లిపోయిన 20వ శతాబ్దంలో వలె కాకుండా, సదవగాహనతో సుఖ సంతోషాలతో జీవనం గడుపుతూ దేశ ప్రగతికి దోహదకారుడవుతారని ఆశిస్తున్నాను."

తర్వాత కృతజ్ఞతలు చెప్పడానికి లేచిన ఆ ఫ్యాక్టరీ యజమానికి ప్రత్యేకంగా దండ వేసారు ఒక వ్యక్తి.

ఆయన శ్రీనివాసరావు తండ్రి రామారావు గారు.

అప్పుడు 20వ శతాబ్దం లోని కార్మికుడయిన రామారావు గారిని, 21వ శతాబ్దంలోని కార్మికుడైన శ్రీనివాసరావు మెచ్చుకోలుగా చూశాడు. ●

ఫరవాలేదు

భర్త: కాంతం, ఏంటింట్లో ఏదో మాడుతున్నట్టుంది. నువ్విక్కడ బాతాఖానీ వేసుకు కూర్చున్నావు.

భార్య: (చిరాకుగా) నా తలకాయ.

భర్త: అయితే ఫరవాలేదు. నేనింకా కూర మాడిపోతున్నదేమో అనుకున్నాను.

వి.వి. సీతారామ్‌దాస్